రోడ్లు ఇలా.. వెళ్లేదెలా?

- బురదరోడ్లతో అవస్థలు
- బైక్ కూడా వెళ్లలేని దుస్థితి
- బీటీ రోడ్లు నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్

బోథ్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారాయి. మట్టిరోడ్లు ఉండడంతో ప్రతీ వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని 16 గ్రామాలకు మట్టిరోడ్లే దిక్కు. మండలంలోని చింతగూడ, నేరేడుపల్లె, కింది బాబెర, గురుదేవ్ నగర్, రేండ్లపల్లె, కొత్తపల్లె, లక్ష్మీపూర్, సుర్దాపూర్, కుచ్చిర్యాల,పరుపులపల్లె, పెద్దగూడ, మామిడిగూడ, గుట్టపక్కతండా, రాంనగర్, సొంగ్వి పల్లె, డెమ్మె గ్రామాలకు మట్టి రోడ్లు ఉండటంతో వర్షం పడినప్పుడు రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నడవలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి బురదలో నడవాల్సిన పరిస్థితి నెలకొంది. తమ గ్రామాలకు రోడ్డు నిర్మించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చిత్తడిగా చింతగూడ రోడ్డు



ఆదివాసీ గ్రామమైన చింతగూడకు వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతుంది. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. చింతగూడ గ్రామం నుంచి మర్లపెల్లి వరకు దాదాపు మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. మర్లపెల్లి గ్రామం నుండి బాబెర గ్రామం వరకు రోడ్డు నిర్మించినా.. చింతగూడ, నేరేడుపల్లె వరకు బీటీ రోడ్డు నిర్మించకపోవడంతో మూడు గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

బురదయమంగా కుచ్చిర్యాల రోడ్డు



గిరిజన గ్రామమైన కుచ్చిర్యాలకు గ్రామానికి వెళ్ల రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. మండబొగడ గ్రామం నుంచి కిలోమీటరు మేర రోడ్డంతా బురదగామ మారింది. దీంతో గ్రామస్తులు నడవలేని పరిస్థితి నెలకొంది. వాహనాలు కూడా వెళ్లడం లేదు. విద్యార్థులు, ఇతర అవసరాల కోసం మండ ల కేంద్రానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

విద్యార్థుల అవస్థలు..

గుట్టపక్కతండా గ్రామానికి వెళ్లే దారి బురదమయంగా మారింది. అంతరాష్ట్ర రహదారి నుంచి కేవలం కిలోమీటరు దూరంలో ఉంది. గ్రామంలో వివిధ పనుల నిమిత్తం సొనాల గ్రామానికి ప్రజలు వస్తుంటారు. విద్యార్థులు సొనాల పాఠశాలకు వెళ్తారు. గ్రామానికి వెళ్లే దారి పూర్తిగా బురదమయంగా మారడంతో గ్రామస్తులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.



నడిచి వెళ్లాల్సిందే..

మండలంలోని రాంనగర్, సొంగ్వి, డెమ్మ గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా బురదమయంగా మారింది. కనీసం ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి. తప్పనిసరి పరిస్థితిల్లో జీపుల్లో విద్యార్థులు వెళ్తున్నారు. బైక్‌లు కూడా నడవ లేవు. కౌఠ(బి) గ్రామం నుంచి తమ గ్రామానికి కిలోమీటరు కన్నా ఎక్కువగా నడిచి వెళ్లాల్సిన వస్తోందని వాపోతున్నారు. తమ గ్రామానికి బీటీరోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.



ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు



ఉధృతంగా ప్రవహిస్తున్న తాంసి వాగు

తాంసి: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆయా గ్రామాల్లోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మండలంలోని తాంసి, హస్నాపూర్, పొన్నారి, కప్పర్ల, సావర్గం, గొట్కూరితో పాటు భీంపూర్ మండలంలోని కరంజి, నిపాని, వడూర్, గోన, అంతర్గాం, ధనోర గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలిగింఇ. ఏకదాటిగా కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని వాగు వరద నీటితో ఉప్పొంగి ప్రవహించింది. వరదనీరు ఆలుగుపై ప్రవహించడంతో స్థానికులు వరద నీటిలో చేపల పట్టారు.

విద్యార్థులకు షూలు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: కపడా బ్యాంక్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూలను పంపిణీ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలక్ మందిర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన బ్యాంక్ సొసైటీ షూలు పంపిణీ చేశారు. ఆ బ్యాంక్ వ్యవస్థాపకుడు జహీర్ అలీ ఖాన్ స్మారకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇంతెఖాబ్ ఆలం, ఖలీల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దయాకర్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

ఇచ్చోడ: మాజీ ఎంపీటీసీ క్లాం దయాకర్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని టీచర్స్‌కాలనీలో దయకర్‌రెడ్డి దశదినకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ యన వెంట మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఏనుగు కృష్ణారెడ్డి, లోక శిరీష్‌రెడ్డి, గాడ్గే సుభాష్, పాండురంగ్, నర్వడే రమేశ్ పాల్గొన్నారు.

అన్నదానం

కై లాస్‌నగర్: వివిధ పనుల నిమిత్తం ఆదిలాబాద్ పట్టణానికి వచ్చే నిరుపేదల ఆకలిని తీర్చేందుకు సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమం నిరంతరం సాగుతోంది. ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న అన్నదానం ఈవారంతో 175వ వారానికి చేరుకుంది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరుపేదలకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, ట్రస్ట్ సభ్యులు మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, రాజయ్య, అంబయ్య, అర్జున్ పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతు



మరమ్మతులు చేస్తున్న గ్రామపంచాయతీ అధికారులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని బొడ్డిగూడ గ్రామం చేతిపంపు నుంచి కలుషిత నీరు వస్తోంది. విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ అధికారులు ఆదివారం చేతిపంపనకు మరమ్మతులు చేశారు. చుట్టూ సిమెంట్ రింగులు ఏర్పాటు చేసి కలుషిత నీరు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈవో సంజీవ్‌రావు, సిబ్బంది ఇద్రిస్, శంకర్‌లాల్, నారాయణ పాల్గొన్నారు.

పరామర్శ

సిరికొండ: మండల కేంద్రంలోని ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న తండ్రి రాజన్న ఇంటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ గోడం నగేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాజన్న మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. రాజన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం మాతృమూర్తి అంబుబాయి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం గ్రామానికి చేరుకుని రాజారాంను, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికిగల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

ఆలయ కమిటీ ఏర్పాటు

బోథ్: మండల కేంద్రంలోని కొట్టాల పోచమ్మ ఆలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బారె నాగరాజు, అధ్యక్షుడిగా కొట్టాల రమేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బీరం చంద్రమోహన్, ఉపాధ్యక్షుడిగా బారె నాగభూషణ్, సామాల వీరయ్య, కోశాధికారిగా కట్కూరి గంగాధర్, సంయుక్త కార్యదర్శులుగా బొడ్డు శ్రీనివాస్, కోల శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా కిరణ్, కూన రాము, కొండ్లెపు రమేశ్, మహేశ్, రోహిత్, గజానంద్, రాములు, గణేష్, సలహాదారులుగా మెరుగు భోజన్న, రాథోడ్ రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి



మాట్లాడుతున్న సోమేశ్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు జాదవ్ సోమేష్ కోరారు. ఈసందర్భంగా హస్నాపూర్‌లో రహదారి పరిశీలించారు. గత కొన్ని ఏళ్లుగా రహదారి పూర్తిగా దెబ్బతిందన్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా రోడ్డుకు మురమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు.

మేడిగూడలో వైద్యశిబిరం

జైనథ్: మండలంలోని మేడిగూడ(ఆర్) గ్రామంలో క్శ్మె భూమారెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి మేడిగూడతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని వడూర్ శివారులోని అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాటిన చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. తమ వంతుగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ప్రతీ గ్రామానికి ఒక పల్లె ప్రగతి వనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు గణేష్, ప్రణయ్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, అల్లూరి శివారెడ్డి, రవీందర్ రెడ్డి, జహీర్, ఉప్పు పోశెట్టి, దేవేందర్ రెడ్డి, సాబ్లే ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని బీర్సాయిపేట్ అటవీరేంజ్ అధికారి గులాం మొయినొద్దిన్ అన్నారు. ఆదివారం మండలంలోని బీర్సాయిపేట జీయర్ గురుకులం ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ రానున్న తరాల కోసం పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్‌వో ప్రియాంక, బీట్ అధికారులు సుజాత, సునీల, బలవంత్‌రావు, మహిపాల్‌సింగ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కళాశాల ఆవరణలో నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది గులాబ్‌సింగ్, ఇబ్రహీం షరీఫ్, అహ్మద్ ఖాన్, శాంతా, శివరత్న, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలి

ఇంద్రవెల్లి: ప్రపంచానికి శాంతి, కరుణ, మైత్రి, అహింస సిద్ధాంతాలను బోధించిన గౌతమ బుద్ధుడి మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని పూజ్య భంతే జీవక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బుద్ధనగర్ కాలనీలో సామ్రాట్ అశోక్ బుద్ధ విహార్‌లో వర్షవాస్ సందర్భంగా భంతేలు జీవక్, పూర్ణ, ప్రజ్ఞలు బౌద్ధ భిక్షులకు బుద్ధుడి బోధనలు బోధించారు. బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటా లకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బుద్ధ, ధమ్మ, సంఘ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, భారతీయ బౌద్ధ మహాసభ మండల అధ్యక్షుడు దుండే సంతోష్, బౌద్ధ భిక్షులు సర్వోదయ్ వైజ నాథ్, గోపినాథ్, సంజీవ్, సందీప్, ప్రదీప్ పాల్గొన్నారు.



బౌద్ధ ప్రవచనలు బోధిస్తున్న భంతేజీలు

సమన్వయంతో పనిచేయాలి

బేల: మండల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, ప్రధాన కార్యదర్శి నాంపెల్లి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గోవర్ధన్ గార్డెన్‌లో మండలస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసిన వారికి పార్టీ అధిష్ఠానం గుర్తింపునిస్తుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమిష్టిగా పనిచేసి అత్యధిక స్థానాలు గెలుపించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గం ఇన్‌చార్జి బోయర్ విజయ్, మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, ఠాక్రే మురళీధర్, సందీప్, బర్కాడే రాము, ఇంద్రశేఖర్, శివకుమార్, పోత్రాజ్ నవీన్, జీవన్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నాంపెల్లి వేణుగోపాల్

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి

నార్నూర్: మధ్యాహ్న భోజనం కార్మికులు జూలై 31న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం నాయకుడు జాడే నాందేవ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేవలం రూ. 1000 వేతనంతోనే వంటలు చేసి విద్యార్థులకు వండి పెడుతున్నామన్నారు. అనేక పోరాటాల అనంతరం ప్రభుత్వం రూ. 2000 పెంచిందన్నారు. ప్రభుత్వమే కోడిగుడ్లు పంపిణీ చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలను రూ. 25కు పెంచాలన్నారు. నాయకులు ఝాడే తారాబాయి, శివాబాయి, సులోచన, గెడం జైలుబాయి, లక్ష్మిబాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

సిరికొండ: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెందుర్ అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి అతి తక్కువ కాలంలో అనేక సంక్షేమ పథకలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అభివృద్ధిని ఓర్వలేకే బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మైనార్టీ చైర్మన్ రంజాన్, లక్ష్మణ్, మల్లేశ్, దత్తు, రాజేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా బోనాల పండుగ

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని తిరుమలనగర్‌లో ఆదివారం కాలనీ వాసులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొప్పుల దేవిదాస్, ప్రేమ్‌సింగ్‌లు మాట్లాడుతూ కాలనీలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రతీ సంవత్సరం లాగానే ఈఏడాది కూడా మహా పోచమ్మ తల్లికి బోనం సమర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు గణేష్, అనిల్ కుమార్, భోజరెడ్డి, రమేశ్, రవికుమార్, పరశురాం, అశోక్, భూమేశ్వర, జగదీశ్వర్ రెడ్డి, నవనీత్, దినేష్, అరవింద్, రూప, స్రవంతి, సుజాత, సంగీత, భాగ్యశ్రీ, ఆకృతి పాల్గొన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా బోనాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలివచ్చి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. సొనాలలో మహర్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మకు బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

గ్రామదేవతలకు బోనాలు

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలకు ఆదివారం బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్లతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలతో పాటు నైవేద్యం సమర్పించారు. ప్రతీఏటా నిర్వహించే బోనాల పండుగలో భాగంగా మండలంలోని తాంసి, కప్పర్ల, వడ్డాడి, పాలోది గ్రామాల్లో పోచ్చమ్మ, సారలమ్మలకు పూజలు చేసి బోనాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. పాడిపంటలు సమృద్ధిగా పండి సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

తలమడుగు: బోనాల పండుగను సుంకిడి గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తరలివచ్చి తరలివచ్చి పూజలు చేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని మహిళలతో బోనం ఎత్తుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ ప్రత్యేక పూజలు చేశారు.



తలమడుగు: బోనాలతో ఊరేగింపు వస్తున్న మహిళలు



కప్పర్లలో పూజలు చేస్తున్న మహిళలు



బోనాల పండుగలో పాల్గొన్న కాలనీవాసులు

ఘనంగా చుక్కల పండుగ



పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గంగన్నపేట, లక్కారం, పాత ఉట్నూర్ గ్రామాల్లో నేతకాని కులస్తులు చుక్కల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు పండి, కుటుంబసభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. మేడి ఆవన్న, దూట మహేందర్, గంగన్న, నర్సయ్య, రాజన్న, భాస్కర్, మల్లయ్య, నవీన్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

సంస్కృతిని భావితరాలకు అందించడమే లక్ష్యం

ఆదిలాబాద్‌రూరల్: అంతరించి పోతున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడమే లక్ష్యమని ఆదివాసీ కవి, కళాకారుడు, ఉపాధ్యాయుడు తొడసం కైలాష్ అన్నారు. పంజోక్న మహా భారత్ తెలుగు మహా భారత కథను గోండు భాషాలో మూడు నెలల వ్యధిలోనే అనువాధించాడు. ఈసందర్భంగా ఆయనను వాఘాపూర్ ప్రజలు శాలువా, పూలమాలతో సత్కరించి అభినందించారు. మర్సకోల హనుమంత్ రావ్, గంగారాం, శ్రీధర్ పాల్గొన్నారు.

ఇలాగైతే రోగాలు రావా?



రాంనగర్ శివాయలం సమీపంలో రోడ్డు పక్కన చెత్త

- కాలనీల్లోనే చెత్తడంపులు

కైలాస్‌నగర్: గ్రేడ్- 1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టణంలో ఏ కాలనీలో చూసిన చెత్తాచెదారం దర్శనమిస్తోంది. రిక్షాకాలనీ పరిధిలోని రిమ్స్ వెనుకల గల ఖాళీ ప్రదేశంతో పాటు సంజయ్‌నగర్‌కు వెళ్లే మార్గంలోని మూల మలువు వద్ద, శాంతినగర్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాల వద్ద, శివాజీచౌక్, రాంనగర్, రవీంద్రనగర్ కాలనీల్లో చెత్తాచెదారంతో కూడిన డంపులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా విలీన కాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. బల్దియాకు సంబంధించి చెత్త సేకరణ వాహనాలను తిప్పుతున్నప్పటికీ చాలా మంది ప్రజలు తమ ఇళ్లలో పోగైన చెత్తను రోడ్లపైనే ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా ప్రతీ వార్డుకు జవాన్లను ఇన్‌చార్జిలుగా నియమించినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. ప్రస్తుతం పట్టణంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పేరుకుపోయిన చెత్తాచెదారంతో కూడిన డంపుల్లో దోమలు వృద్ధి చెంది, వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. చెత్తను బల్దియా సిబ్బంది సకాలంలో తొలగించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి చెత్తను రోడ్లపై వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

కాంబ్లే నాందేవ్ సేవలు చిరస్మరణీయం

నార్నూర్: దళిత నేతగా, మాజీ డీసీసీబీ చైర్మన్‌గా ఏజెన్సీ దళితుల హక్కుల కోసం పోరాడిన కాంబ్లే నాందేవ్ సేవలు చిరస్మణీయమని మాజీ ఎమ్మె ల్యే ఆత్రం సక్కు అన్నా రు. ఆదివారం గుంజాల గ్రా మంలో కాంబ్లే నాందేవ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బానోత్ గజానంద్ నాయక్, రూప్‌దేవ్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కోర్రెల్లా మహేందర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఆత్రం సక్కు